సాక్షి
కామారెడ్డి
ఆదివారం | 24 | మార్చి | 2024



ఘనంగా హోలీ

జిల్లాలోని పలు పాఠశాలల్లో శనివారం హోలీ పండుగ నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకున్నారు.

- 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ ఆది : 6:34

సహర్ సోమ : 4:54

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.5/18.8

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఇబ్బందిపెడుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఒకటో తేదీనుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. ఒకటో తేదీనుంచి 15వ తేదీవరకు రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

23 మంది గైర్హాజరు



కామారెడ్డి టౌన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన పరీక్షకు 11,962 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 11,939 మంది పరీక్ష రాశారు. 23 మంది గైర్హాజయ్యారు. ప్రైవేట్ అభ్యర్థులు 8మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఐదుగురే రాశారు. దేవునిపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గౌతమ్ మోడల్ హైస్కూళ్లలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం డీఈవో రాజు తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో యోసెఫ్ తదితరులున్నారు.

కామారెడ్డి బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



శ్రీకాంత్‌గౌడ్



సురేందర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది అమృతరావు వైద్య వ్యవహరించారు. అధ్యక్షుడిగా కోలా శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా చింతల గోపి, ప్రధాన కార్యదర్శిగా బండారు సురేందర్‌రెడ్డి, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా మోహన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సలీం, సందీప్‌రెడ్డి, అన్సర్ అలీ, షబానా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ నాయకుడు, సెన్సార్ బోర్డు మెంబర్ అతిమాముల రామకృష్ణగుప్తా శనివారం పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో సరైన ప్రాధాన్యత లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

అమెరికా సదస్సుకు ఎంపిక



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని చైతన్య పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి శ్రీమాన్ చారి అమెరికాలో నిర్వహించే అంతర్జాతీయ స్పోక్ డెవలప్‌మెంట్ సదస్సుకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. ఆ సదస్సులో 'అవధులు లేని అంతరిక్షం' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇస్తాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు.

సొసైటీకి తాళం వేసిన రైతులు

కమ్మర్‌పల్లి: కోనసముందర్ సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని పాలకవర్గ సభ్యులు, రైతులు డిమాండ్ చేశారు. శనివారం చైర్మన్ సామ బాపురెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు, యూరియా విక్రయాలపై వచ్చిన కమీషన్ వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. సీఈవో అక్రమాలకు పాల్పడినట్లు రైతులు ఆరోపించారు. అనంతరం పాలకవర్గ సభ్యులు, రైతులు కలిసి సొసైటీ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని తీర్మానం చేశారు. అనంతరం లెక్కలు తేలే వరకు సొసైటీ తెరవకూడదని తాళం వేశారు.



రంజాన్ రుచులు..

ముస్లింల పవిత్ర మాసం రంజాన్. ఈ నెలలో ఉపవాస దీక్షలు చేపడతారు. ఉపవాసం ద్వారా కోల్పోయిన శక్తిని తిరిగి పొందేందుకు ప్రత్యేక ఆహారాన్ని తీసుకుంటుంటారు. మటన్, చికెన్‌లతో చేసే హలీం, హరీస్‌లు మరుసటి రోజు ఉపవాసానికి వారికి శక్తినిస్తాయి. ఒకప్పుడు హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితమైన ఈ ఆహారం.. తర్వాతి కాలంలో నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి తదితర పట్టణాలకూ విస్తరించింది. ఇప్పుడు మండల కేంద్రాలలోనూ తయారు చేస్తున్నారు. ఈ ఆహారానికి డిమాండ్ ఉండడంతో విక్రయ కేంద్రాలన్నీ కిక్కిరిసి కనిపిస్తున్నాయి.

హలీంపై 'సాక్షి' సండే స్పెషల్..

- హలీం, హరీస్‌లకు డిమాండ్
- పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోనూ తయారీ



సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి : రంజాన్ మాసం వచ్చిందంటే అందరికీ గుర్తొచ్చే వంటకం హలీం. మటన్‌తో చేసే హలీంతోపాటు చికెన్‌తో చేసే హరీస్‌ను చాలామంది ఇష్టపడతారు. మాంసాన్ని మెత్తగా ఉడికించి చేసే ఈ వంటకాలను తయారు చేయడం ప్రయాసతో కూడిన ప్రక్రియ. అరబ్ దేశాల సంప్రదాయ వంటకం అయిన హలీంను తయారు చేసే కేంద్రాలు జిల్లాలోనూ ఏర్పాటయ్యాయి.

రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే రోజా అనంతరం ఇఫ్తార్‌లో తీసుకునే హలీం, హరీస్‌లకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఉపవాసం ద్వారా కోల్పోయిన శక్తిని తిరిగి పొందేందుకు ఈ ఆహారాన్ని తీసుకుంటారు. తక్కువ మసాలాలతో మాంసాహారాన్ని బాగా ఉడికించడం వల్ల తేలిగ్గా జీర్ణమై తక్షణమే శక్తినిస్తుంది. ఒకప్పుడు హలీం తినాలంటూ హైదరాబాద్ నగరానికి వెళ్లాల్సి వచ్చేది. తర్వాతి కాలంలో నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బోధన్, ఆర్మూర్ తదితర పట్టణాల్లోనూ హలీం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం మండల కేంద్రాల్లోనూ ఈ ఆహారాన్ని తయారు చేస్తున్నారు. నెల రోజుల పాటు హలీం, హరీస్‌లు అందుబాటులో ఉంటున్నాయి.

ఉపవాసం పూర్తవగానే...

రంజాన్ ఉపవాసాలు పాటించే వారు సాయంత్రం ప్రార్థనల తర్వాత హలీం, హరీస్‌లను ఇష్టంగా తింటారు. ఇతర మతస్తులు కూడా హలీం తినడానికి ఇష్టపడతారు. కొందరు హైదరాబాద్‌కు వెళ్లి మరీ హలీం తిని వస్తుంటారు. ఈ మాసంలో షీర్ ఖుర్మా, కద్దూకా ఖీర్ వంటి స్వీట్లు కూడా ఆరగిస్తారు.



హలీం తయారీ అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. దీని తయారీ కోసం ప్రత్యేకంగా తాత్కాలిక బట్టీని నిర్మిస్తారు. పెద్ద అండాలు అమరేలా ఏర్పాట్లు చేస్తారు. బట్టీలో నుంచి మంట బయటకు రాకుండా చుట్టూరా మూసేస్తారు. మంట పూర్తయిన

ప్రత్యేకంగా బట్టీల నిర్మాణం..

తర్వాత నిప్పులతో వచ్చే వేడితో హలీం పూర్తిస్థాయిలో ఉడుకుతుంది. దాదాపు 12 గంటల పాటు వేడిగా ఉండేలా చూసుకుంటారు. రంజాన్ ముగియగానే బట్టీలను తొలగిస్తారు. హలీం, హరీస్‌ల తయరీలో గోధుమ రవ్వతోపాటు ఎముకలు తీసేసిన చికెన్ లేదా మటన్ ఖీమా, పెసరపప్పు, శనగపప్పు, కంది పప్పు, జీడిపప్పు, బాదం, పాలు, డాల్డా, శొంఠి, పచ్చిమిర్చి, లవంగాలు, దాల్చిన చెక్క తదితర సుగంధ ద్రవ్యాలు విని యోగిస్తారు.



బలం కోసం హలీం..



రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువగా హలీం ఇష్టపడతారు. ఒక్కపొద్దు ఉంటాం కాబట్టి బలం కోసం ఈ ఆహారం తీసుకుంటాం. హలీంలో ఎక్కువ ప్రొటీన్లు ఉండి, శక్తినిస్తాయి.

– నజీర్, పిట్లం

చాలా ఇష్టంగా తింటా



ఉపవాస దీక్షతో అలసిపోయిన శరీరానికి హలీం సత్వర శక్తినిస్తుంది. ఏటా రంజాన్ మాసంలో ప్రత్యేకంగా లభించే ఈ ఆహారం అంటే చాలా ఇష్టం. మిత్రులతో కలిసి వేడివేడి హలీం తినడంలో ఉన్న మజానే వేరు.

– షోయబ్‌ఖాన్, బాన్సువాడ

అందరూ ఇష్టపడతారు



రంజాన్ మాసంలోనే హలీం లభిస్తుంది. ఈ ఆహారాన్ని ముస్లింలందరు ఇష్టంగా తింటారు. దీనికి మతాలకు అతీతంగా అభిమానులున్నారు. నా స్నేహితులకు ఇష్టంగా హలీం తినిపిస్తాను.

– షరీఫ్, కానిస్టేబుల్, కామారెడ్డి

నీటి వనరులను సంరక్షించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఉమామహేశ్వరరెడ్డి

కామారెడ్డి అర్బన్ : భూమిపై జీవరాశులకు నీరు అనేది ప్రధానమైనందున దాన్ని ఎంత భూమిలో దాచుకుంటే అంతగా భవిష్యత్తుకు భూగర్భజలాలు ఉపయోగపడతాయని పర్యావరణ శాస్త్రవేత్త సి.ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. నీటి ప్రాముఖ్యతపై కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర, అటవీశాస్త్ర విభాగం, హైదరాబాద్‌కు చెందిన కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్(సీజీఆర్)ల ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి వనరులను సంరక్షించడంతోపాటు పొదుపుగా వినియోగించేలా చూడడంలో యువత పాత్ర కీలకమన్నారు. విశ్రాంత అటవీ అధికారి కే.తులసీరావు మాట్లాడుతూ అడవులు, జంతువులు, నీటి సంరక్షణ, పర్యావరణం, సహజ సంపద గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, అకడమిక్ సమన్వయకర్త వి.శంకరయ్య, వృక్షశాస్త్ర, అటవీశాస్త్ర విభాగాల అధిపతులు జే.సుచరణ్, యు.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో కేంద్ర బలగాల కవాతు



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం జిల్లాకేంద్రంలో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణంలోని పాత బస్టాండ్, ధర్మశాల, రామారెడ్డి చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, పాంచ్ రస్తా, బడామజీద్, అంబేడ్కర్ విగ్రహం, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, అశోక్ నగర్ క్రాస్‌రోడ్, రైల్వే గేట్, సైలానీబాబా కాలనీ, బతుకమ్మ కుంట మీదుగా తిరిగి రైల్వే స్టేషన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో కేంద్ర భద్రతా బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ప్రజలలో అభద్రతా భావాన్ని తొలగించి, మేమున్నామన్న భరోసా కల్పించేందుకు ఈ కవాతు దోహదపడుతుందని పేర్కొన్నారు.

బ్యాడ్ టీ(ట)చర్స్!

- వృత్తికే కళంకం తెస్తున్న పలువురు ఉపాధ్యాయులు
- వరుస ఘటనలతో ఆందోళన
- వెలుగులోకి రానివెన్నో...



పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి, బంగారు భవితకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులే వక్రమార్గం పడుతున్నారు. సమాజానికి ఆదర్శంగా ఉండాల్సినవారే కీచక మనస్తత్వంతో విద్యార్థులను ఇబ్బందిపెడుతున్నారు. తండ్రిలా చూసుకోవాల్సిన వారే తప్పుడు స్పర్శలతో ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెస్తున్నారు. ఇటీవల పాఠశాలల్లో వెలుగు చూస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

సాక్షి, కామారెడ్డి : ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చేలా ప్రవర్తిస్తున్నారు కొందరు ఉపాధ్యాయులు. తాజాగా నాగిరెడ్డిపేట మండలంలో ఓ ఉపాధ్యాయుడు అభంశుభం తెలియని చిన్నారులను లైంగికంగా వేధించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో బ్యాడ్ టచ్, గుడ్ టచ్ పేరుతో విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పిల్లలు తాము సదరు టీచర్‌తో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెల్లడించారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి కేసు నమోదు చేసి, సదరు టీచర్‌ను అరెస్టు చేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ కార్యక్రమం నిర్వహించడం వల్లే పిల్లలు తమ గోడును చెప్పుకోగలిగారు. లేదంటే మరింత కాలం ఆ కీచకుడి వికృత చేష్టలు కొనసాగి ఉండేవి. తాడ్వాయి మండలంలోనూ ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులను లైంగికంగా వేధించిన సంఘటన ఇటీవల వెలుగు చూసింది. గాంధారి మండలంలో ఓ కీచక ఉపాధ్యాయుడిపైనా కేసు నమోదైన విషయం తెలిసిందే. గతంలో దోమకొండ మండలంలోనూ ఓ ఉపాధ్యాయుడిపై కేసు నమోదైంది. ఇలా వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమే.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్లే ఇబ్బందులకు గురిచేస్తుండడంతో ఎవరికీ చెప్పుకోలేక పిల్లలు కుంగిపోతున్నారు

తప్పని తెలిసినా..

సమాజంలో ఉపాధ్యాయుడికి గౌరవనీయ స్థానం ఉంది. తమ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే టీచర్లను విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతగానో గౌరవిస్తారు. అలాంటి వృత్తిలో కొనసాగుతున్న వారు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడం ఇబ్బందికరంగా మారింది. విషయం బయటకు తెలిస్తే తాము కటకటాల పాలవుతామని తెలిసి కూడా తప్పు చేస్తున్నారు. ఆడపిల్లలను లైంగికంగా వేధించేవారిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో రోజుల తరబడి బెయిల్ రాక జైళ్లలోనే ఉండాల్సి వస్తోంది. అయినా కీచక టీచర్లలో మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థినులతో తప్పుగా ప్రవర్తించే వారి విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఏదో రకంగా తాకడం..

కొందరు టీచర్లు ఆడపిల్లలను ఏదో రకంగా తాకే ప్రయత్నం చేస్తున్న సంఘటనలతో విద్యార్థినులు బెంబేలెత్తిపోతున్నారు. అభంశుభం తెలియని చిన్నారులతో వారు ప్రవర్తిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. ఏదో ఒక వంకతో ఆడపిల్లల్ని ఒంటరిగా పిలిపించి ఇబ్బంది పెడుతున్న సంఘటనలున్నాయి. అయితే తమతో కీచక టీచర్లు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నా కొందరు బయటకు చెప్పుకోలేకపోతున్నారు. కొన్నిచోట్ల పిల్లలు తాము పడుతున్న ఇబ్బందులను కన్నవారికి చెప్పుకునే ప్రయత్నం చేయడం, వారు సదరు టీచర్‌ను నిలదీయడమో లేదంటే బయటకు చెప్పుకుంటే బద్నాం అవుతామని మిన్నకుండడమో చేస్తున్నారు.

వివాహిత దారుణహత్య



లాస్య(ఫైల్)



పాపను ఆడిస్తున్న కాలనీవాసులు

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్‌లో పట్టపగలు వివాహిత దారుణ హత్యకు గురైంది. పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీలో శనివారం మధ్యాహ్నం రాసురి లాస్య (22)ను దుండగులు గొంతుకోసి హతమార్చారు. వివరాలిలా ఉన్నాయి. వేల్పూర్ మండలం వెంకటాపూర్‌కు చెందిన లాస్యకు రెండేళ్ల క్రితం ఆర్మూరుకు చెందిన రాసూరి రాకేశ్‌తో వివాహమైంది. వీరికి ఏడు నెలల పాప శ్రీలక్ష్మణ ఉంది. రాకేశ్ మూడు నెలల క్రితం ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. లాస్య అత్త చిన్నుబాయితో కలిసి ఉంటోంది. శనివారం ఉదయం చిన్నుబాయి కోరుట్లలో గల తన కూతురు వద్దకు వెళ్లింది. లాస్య మధ్యాహ్నం ఒంటి గంట వరకు తన ఇంటి సమీపంలో ఓ ఇంట్లో బీడీలు చేసి వచ్చింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పాప ఏడుస్తుండడంతో పక్క ఇంట్లో ఉంటున్న చిట్టి అనే మహిళ వెళ్లి చూడగా లాస్య రక్తపుమడుగులో కనిపించింది. దీంతో ఆమె స్థానికులకు చెప్పడంతో వారు అంబులెన్స్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. లాస్యను హత్య చేసిన వారు ఆమె మెడలోని బంగారు నగలు, చెవి దుద్దులు ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు.

పాపం చిన్నారి..

రక్తం మడుగులో పడి ఉన్న తల్లి వద్ద చిన్నారి ఏడుస్తుండటం కలచి వేసింది. తండ్రి దగ్గర లేకపోవడం తల్లి చనిపోవడంతో ఆ పాప గుక్క పెట్టి ఏడవగా స్థానికులు అక్కున చేర్చుకొని ఓదార్చారు. కాగా తెలిసినవారే లాస్యను హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్‌కు ఈడీ?

- ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో రానున్నట్లు సమాచారం
- వివరాలు సేకరిస్తున్న సెంట్రల్ ఇంటెలిజెన్స్ అధికారులు..

ఖలీల్‌వాడి: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో నిజామాబాద్‌లోని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆస్తులపై సెంట్రల్ ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. కవిత భర్త అనిల్ వ్యాపార లావాదేవీలు, వారికి సన్నిహితంగా ఉన్నవారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కవితకు అనుకూలంగా వ్యవహరించినట్లు భావిస్తున్న జిల్లాలో కీలక స్థానంలో పనిచేసి ప్రస్తుతం బదిలీ అయిన అధికారితో పాటు ఓ రెవెన్యూ ఉద్యోగి పాత్రపైనా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఆస్తులకు సంబంధించిన బినామీలు ఎవరైనా ఉన్నారా అన్న కోణంలోనూ విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ వివరాలు సేకరించాక ఈడీ అధికారులు నిజామాబాద్ వచ్చే అవకాశాలున్నాయి.



జిల్లా కేంద్రంలోని శాంతిటాకీస్ రోడ్‌లో కామ దహనం చేస్తున్న కాలనీవాసులు

ఘనంగా కామ దహనం

హోలీ పండుగ సందర్భంగా శనివారం రాత్రి కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపాలిటీ వద్ద ఆర్యసమాజ్, శాంతిటాకీస్ రోడ్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కామదహనం నిర్వహించారు. – కామారెడ్డి టౌన్

క్లుప్తంగా

ఎల్లారెడ్డి ఐటీఐ స్థలం పరిశీలన



ఎల్లారెడ్డి : పట్టణ శివారులోని 1406 సర్వే నెంబరులో ఐటీఐకి కేటాయించిన స్థలాన్ని టాటా టెక్నాలజీ బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలతో టాటా టెక్నాలజీ అనుబంధంగా అదనపు కోర్సులను ప్రవేశ పెట్టనున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ శివరాజ్ తెలిపారు. ఎల్లారెడ్డి ఐటీఐ కళాశాలలో ఉన్న కోర్సులతో పాటు అదనంగా టాటా టెక్నాలజీ సంస్థ ద్వారా ఎలక్ట్రికల్ మెకానికల్, ఆటోమిషన్ రోబోటిక్, అడ్వాన్స్ వెల్డింగ్, అడ్వాన్స్ ఆటో మొబైల్ కోర్సులను పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఆల్వాల్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య, ఎల్లారెడ్డి ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్, సిబ్బంది చంద్రశేఖర్ తదితరులున్నారు.

పోటీ పరీక్షల సెల్ కోఆర్డినేటర్‌గా అంజయ్య



భిక్కనూరు : తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్ పోటీపరీక్షల సెల్ కో–ఆర్డినేటర్‌గా సోషల్ వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్యను నియమించారు. ఈమేరకు శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ నియామకపత్రంను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ కవిత తౌరస్, హాస్టల్ వార్డెన్ డాక్టర్ యాలాద్రి పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్లకు గడుపు పొడిగింపు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల జూనియర్ బాలుర కళాశాలలో 2024–25కు గాను అడ్మిషన్ల గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల కిషన్ తెలిపారు. కళాశాలలో ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

వచ్చేనెలలో యోగా, చికిత్స శిబిరం

కామారెడ్డి అర్బన్ : వచ్చేనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెలరోజుల పాటు స్థానిక జన్మభూమి రోడ్డులోని ఆర్యసమాజంలో ప్రతి రోజు ఉదయం యోగాశిబిరం, చికిత్స కేంద్రం నిర్వహించనున్నట్లు ఆర్యసమాజ్ ప్రతినిధి అర్వపల్లి రమేశ్ తెలిపారు. నేపాల్‌కు చెందిన యోగిరాజ్ గురుకేశవ్ ఉపాధ్యాయ, కుసుమ్ సునర్ యోగాతో పాటు మెడ, నడుపు, కీళ్ల, సంధివాతం, పక్షవాతం, ఫిట్స్, సోరియాసిస్, బీపీ, షుగర్, కంటి దృష్టి,గర్భాశయ వ్యాధులు, సంతానలేమి వాటికి చికిత్సలు, సలహాలు సూచనలు అందజేస్తారన్నారు.

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు 50 వేలకు మించి డబ్బులను వెంట తీసుకుని వెళ్ళరాదని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నర్సింగ్‌రావు తదితరులున్నారు.

పిడిగుద్దులతో వసంతోత్సవం

- హోలీ సందర్భంగా హున్సాలో ఏర్పాట్లు
- దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

వసంత రుతువు రాకకు గుర్తుగా సంబురంగా నిర్వహించే హోలీ.. ఆ గ్రామంలో పిడిగుద్దులకు వేదిక అవుతుంది. గ్రామ శ్రేయస్సు కోసం యువత, పెద్దలు రెండుగా విడిపోయి ఒకరిపైఒకరు పిడిగుద్దులు కురిపించుకుంటారు. ఎలాంటి భేదభావం లేకుండా ఐక్యమత్యంతో పూర్వీకుల కాలం నుంచి 'పిడిగుద్దులాట'ను కొనసాగిస్తున్నారు.

బోధన్‌రూరల్(బోధన్) : తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దులోని మంజీర తీరంలో ఉన్న హున్సా గ్రామం పిడిగుద్దులాటతో ప్రత్యేక గుర్తింపు పొందింది. దేశంలో ఎక్కడాలేని విధంగా హోలీ పండుగ రోజున పిడిగుద్దులాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ కులమత, వయోబేధం లేకుండా దశాబ్దాలుగా ఐక్యతతో పిడిగుద్దులాటను నిర్వహిస్తున్నారు. పోలీసుశాఖ అభ్యంతరం తెలుపుతున్నా..

సాగేదిలా..

గ్రామంలోని హనుమాన్ ఆలయం ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశం పిడిగుద్దులాటకు వేదిక. గ్రామశివారులో కుస్తీ పోటీలు ముగియగానే డప్పు చప్పుళ్ల మధ్య గ్రామస్తులు, యువకులు కేరింతలు కొడుతూ గ్రామ పెద్దల ఇళ్లకు వెళ్లి వారిని పిడిగుద్దులాట వేదిక వద్దకు తీసుకొస్తారు. అక్కడి చేరుకోగానే, పెద్దల సూచనతో రెండుగా విడిపోయి పిడిగుద్దులాట కోసం ఏర్పాటు చేసిన తాడుకు ఇరువైపుల మోహరిస్తారు. గ్రామపెద్దల సంకేతంతో 'పిడిగుద్దులాట'ను ప్రారంభించి ఎడమ చేయితో తాడును పట్టుకుని కుడిచేయి పిడికిలితో ఒకరినొకరు బాదుకుంటారు. ఈ సమయంలో కేరింతలతో పిడిగుద్దలాట వేదిక దద్దరిల్లుతుంది. సుమారు 10 నుంచి 20 నిమిషాలపాటు పిడ్డిగుద్దులాట కొనసాగుతుంది. అనంతరం గ్రామస్తులు అంతా మరిచిపోయి ఎప్పటిలాగే ఒకరినొకరు ఆలింగనం చేసుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. బోధన్ డివిజన్‌కు చెందినవారితోపాటు మహారాష్ట్ర చుట్టు పక్కల మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. గ్రామంలో పెద్ద ఎత్తున జాతర కొనసాగుతుంది.



పిడిగుద్దులాట ఆడుతున్న హున్సా గ్రామస్తులు (ఫైల్)

తమ గ్రామ శ్రేయస్సుకోసం 'పిడి గుద్దులు' తప్పవని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.

కామదహనం, కుస్తీ పోటీలు

హోలీని పురస్కరించుకొని హున్సాలో ఆదివారం రాత్రి (నేడు) కామదహనం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం నుంచి హోలీ సంబురాలు జరుపుకుంటారు. మధ్యాహ్నం వరకు రంగులాటను ముగించి గ్రామ శివారులో పెద్దఎత్తున కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మల్లయోధులు, తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

సంప్రదాయానికి నిదర్శనం



పిడిగుద్దులాట మా గ్రామ సంప్రదాయానికి నిదర్శనం. కుల మతలు, చిన్నాపెద్ద తేడాలేకుండా గ్రామస్తులందరం పిడిగుద్దులాట ఆడతాం. పిడిగుద్దులాట నిలిపివేస్తే గ్రామానికి మంచిదికాదనే పూర్వీకుల మాటను పాటించి ఐక్యమత్యంతో, సోదరభావంతో పండుగను జరుపుకుంటాం.

– చిల శంకర్, మాజీ ఎంపీటీసీ, హున్సా

గ్రామం సుభిక్షంగా ఉండాలని..



గ్రామంలో పిడిగుద్దులాట నిర్వహించడం దశాబ్దాలుగా గ్రామ ఆనావాయితీ. మా పూర్వీకుల నుంచి వచ్చిన పిడిగద్దులాటను నిర్వహిస్తే గ్రామానికి మేలు జరుగుతుందని మా నమ్మకం. గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామంలో ప్రతి ఏటా హోలీ పండుగ రోజున పిడిగుద్దులాటను నిర్వహిస్తున్నాం.

– పల్లె గంగారాం, గ్రామపెద్ద, హున్సా

దీనస్థితిలో పశువులు



తాడ్వాయి శివారులో తాగునీరు లేక బక్కచిక్కిపోయిన పశువులు

- వారం రోజులుగా కరెంట్ కటకట
- పశువుల యజమానులకు ఇక్కట్లు
- రెండురోజులు పట్టవచ్చంటున్న ట్రాన్స్‌కో సిబ్బంది

తాడ్వాయి : తాడ్వాయి శివారులోని వ్యవసాయ బావుల వద్ద వారం రోజుల నుంచి విద్యుత్‌సరఫరా లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనెల 16వతేదీన రాత్రి గాలి, దుమారంతో కూడిన వడగండ్ల వాన కురియడంతో విద్యుత్ స్తంభాలు విరిగి నేలపై పడ్డాయి. అలాగే స్తంభాలకు ఉన్న విద్యుత్ తీగలు సైతం పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరా జరగట్లేదని రైతులు వాపోతున్నారు. కరంటు సరఫరా కాకపోవడంతో వ్యవసాయ పొలాల వద్ద కట్టేసిన ఆవులు, గేదెలకు తాగునీరు అందట్లేదు. దీంతో రైతులు బావులు, ఇంటినుంచి బిందెలలో నీళ్లను తీసుకొని పోయి పశువులకు నీళ్లను అందిస్తున్నారు. నీళ్ల లేక పశువులు సరిగ్గా మేత మేయకపోవడంతో పశువులు బక్కచిక్కిపోతున్నాయని, దీంతో పాలు సరిగ్గా ఇవ్వట్లేదని వాపోతున్నారు. కరెంటు రావాలంటే ఇంకా రెండురోజులు పట్టవచ్చని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

నీళ్లు లేక అవస్థలు..



వారం రోజుల నుంచి కరంటు సరఫరా కాకాపోవడంతో పాడి పశువులకు తాగునీటిని అందివ్వలేకపోతున్నాను. నీళ్లలేక పశువులు మేత మేయడం లేదు. దీంతో పశువులు బక్కచిక్కిపోతున్నాయి. ఇంటి నుంచి నీళ్లను తీసుకొని పశువులకు అందిస్తున్నాను.

– లక్ష్మణ్‌రావు, రైతు తాడ్వాయి

'నోరు అదుపులో పెట్టుకోవాలి'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్

సుభాష్‌నగర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ అర్వింద్, బీజేపీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమన్నారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలకు మోదీపై, నిజామాబాద్ ప్రజలకు ఎంపీ అర్వింద్‌పై విశ్వాసముందన్నారు. పసుపు ధర రూ.20వేలు రావడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సాగు తగ్గడంతో ధర పెరిగిందని అంటున్నారని, కానీ అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరకు, రాష్ట్రంలో సాగు తగ్గడానికి పొంతన లేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమల్జేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నా నిజామాబాద్‌లో కాంగ్రెస్‌కు ఇంకా అభ్యర్థి ఎవరో తెలియదని ఎద్దేవాచేశారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌కు డిపాజిట్ రాదు

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి డిపాజిట్ రాదని, బాజిరెడ్డి ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారో చెప్పాలని దినేష్ కులాచారి ప్రశ్నించారు. బీజేపీ ఓట్లు చీల్చడానికే బాజిరెడ్డి బరిలో ఉన్నారని ఆరోపించారు. ఆర్వోబీల జాప్యానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని, ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ వేయాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, ప్రమోద్, మాస్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను లైంగికంగా వేధిస్తే పోక్సో కేసు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: పిల్లలను లైంగికంగా వేధిస్తే పోక్సో కేసు నమోదు చేయాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. జిల్లా నాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోక్సో, ఎన్‌డీపీఎస్ చట్టాలపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల హాజరై చట్టాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. పోక్సో, ఎన్‌డీపీఎస్ ద్వారా విధించే శిక్షలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కలెక్టర్ కిరణ్‌కుమార్, సీపీ కల్మేశ్వర్ సింగన్వార్, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రెటరీ పీ పద్మావతి, గోపాలకృష్ణ గోఖలే, న్యాయమూర్తులు కుష్బూ ఉపాధ్యాయ, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పించాలని..



నవీపేట : గ్రామపంచాయతీలో అటెండర్‌గా విధులు నిర్వర్తించిన తనను అకారణంగా విధుల నుంచి తొలగించారని లలిత అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్తతో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి శనివారం వచ్చింది. తన భర్త శంకర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబ పోషణ భారమైందని, తన ఉద్యోగం తనకు ఇప్పించాలని అధికారులను వేడుకుంది.

క్రైం కార్నర్

స్నేహితులతో ఈతకు వెళ్లి కానరాని లోకాలకు..



మోసిన్(ఫైల్)

నవీపేట: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బర్కత్‌పురా కాలనీకి చెందిన మహ్మద్ మోసిన్(13) శుక్రవారం పాఠశాల ముగియగానే స్నేహితులతో కలిసి దగ్గరలోని అలీసాగర్ కాలువలో ఈతకు వెళ్లి నీటిలో గల్లంతయ్యాడు. నీటి విడుదలను నిలిపివేసి వెతుకగా, రాత్రి వేళలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి హైమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మోసిన్ స్థానిక స్కాలర్స్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు.

చేపల వేటకు వెళ్లి..

నందిపేట్ (ఆర్మూర్): చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండలంలోని కౌల్‌పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన బండారి రవి (20) స్నేహితులతో కలిసి తల్వేద శివారులోని వాగులో చేపల వేటకు వెళ్లాడు. రవి ప్రమాదవశాత్తు వాగు బ్రిడ్జి పైనుంచి కాలుజారి నీటిలో పడిపోయి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

పశువుల కాపరి..

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన సుంకరి పెద్దగంగారాం (44) ప్రమాదవశాత్తు ఊర చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశువుల కాపరి గంగారాం శనివారం ఊర చెరువు వద్దకు పశువులను తీసుకెళ్లాడు. చెరువులోకి దిగిన పశువులను బయటకు కొట్టేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య సాయమ్మతోపాటు ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. నిజామాబాద్‌లో కంప్యూటర్ క్లాస్‌కు వెళ్తున్నాని ఈనెల 21న ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన యువతి..

ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన సంధ్యారాణి ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాక పోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ సంధ్యారాణి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రామారెడ్డి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. శనివారం వేకువజామున స్కూల్ తండా నుంచి రెడ్డి పేట గ్రామానికి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఘన్‌పూర్ రోడ్డువద్ద పట్టుకున్నారు.

దేవునిపల్లి పీఎస్ పరిధిలో..

కామారెడ్డి క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను దేవునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. కామారెడ్డి మండలం గూడెం నుంచి జిల్లా కేంద్రానికి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండగా పట్టణ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ట్రాక్టర్‌ను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు.

రూ. 50 వేల జరిమానా..

జక్రాన్‌పల్లి: ఈ నెల 22న అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మండలంలోని బాలనగర్‌లో పట్టుకుని ఎస్సై తిరుపతి కేసు నమోదు చేశారు. అనంతరం జిల్లా మైన్స్ అధికారులకు అప్పగించగా, వారు టిప్పర్‌కు రూ.50వేల జరిమానా విధించారు. టిప్పర్‌ను కోర్టులో డిపాజిట్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు 50 వేలకు మించి డబ్బులను వెంట తీసుకుని వెళ్ళరాదని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నర్సింగ్‌రావు తదితరులున్నారు.

చెరువులో యువకుడి గల్లంతు..

- జగిత్యాల జిల్లాలో ఘటన



నాకేపు శివ (ఫైల్)

మాక్లూర్: మండలంలోని ధర్మోరాకు చెందిన సాయినోల్ల నాకేపు శివ (22) జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మిట్టాపూర్ చెరువులో గల్లంతయ్యాడు. శివ గత కొంత కాలంగా డైలీ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుక ఉందని రాత్రికి అక్కడే ఉండి శనివారం వస్తానని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉన్న శివ శనివారం ఉదయం స్నేహితులతో కలిసి చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కోరుట్లకు తరలివెళ్లారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోర్గాం(పి) వద్ద నడుచుకుంటూ వెళ్తున్న బేగరి స్వామి(48)ని మోపాల్ వైపు నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో స్వామికి బలమైన గాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన అశ్విన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పూసలగల్లీలో శనివారం విద్యుత్‌షాక్‌తో ఒకరికి గాయాలయ్యాయి. అజ్మతుల్లాఖాన్(50), కృష్ణ(20) గణపతి టెక్స్‌టైల్ పైన మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలాయి. గాయాలపాలైన ఇరువురిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ అధికారుల అనుమతులు లేకుండా మరమ్మతులు చేయించిన గణపతి టెక్స్‌టైల్స్ యజమాని కన్న రాజుపై ఏడీ రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

పరామర్శించి పరీక్షకు తీసుకెళ్లి..



ఫొటోలో కనిపిస్తున్న విద్యార్థి పేరు శివకుమార్. గుండారం ప్రాథమిక పాఠశాలలో పదో తరగతి చదివాడు. ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతుండగా, శివకుమార్ తండ్రి గంగాధర్ బుధవారం గుండె పోటుతో మృతి చెందాడు. పుట్టెడు దుఃఖంలో శివకుమార్ గురువారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షరాయగా, అతడు ఇంటికి వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్న శివకుమార్‌ను పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రామ్మోహన్, ఇన్విజిలేటర్ ఆరోగ్యరావు శనివారం ఉదయం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆత్మస్థైర్యంతో పరీక్షరాయాలని సూచించారు. శివకుమార్‌ను తమ వెంట పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. – నిజామాబాద్ రూరల్

ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- ఉదయం 10 గంటలకు ఘటన
- బంగారం, వెండి, నగదు అపహరణ



ఇంట్లో చిందరవందరగా పడిఉన్న వస్తువులు

నిజామాబాద్‌రూరల్: మండలంలోని గూపన్‌పల్లిలో నివాసముంటున్న ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో దుండగులు శనివారం ఉదయం 10 గంటలకు చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జానకంపేటలోని ట్రెయినింగ్ సెంటర్‌లో విధులు నిర్వర్తించే ఏఆర్ కానిస్టేబుల్ సాయన్న శనివారం ఉదయం డ్యూటీపై వెళ్లగా, అతడి భార్య భూలక్ష్మి పని నిమిత్తం దూపల్లి గ్రామానికి వెళ్లింది. ఇంటి తాళాన్ని పగులగొట్టిన దుండగులు లోనికి ప్రవేశించి ఆరున్నర తులాల బంగారం, 25 తులాల వెండి, రూ.29 వేల నగదు ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తరువాత గమనించిన స్థానికులు వెంటనే సాయన్నకు సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న సాయన్న చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డితోపాటు ఎస్సై ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్లపై మత్తుమందు చల్లి..



దుండగులు తొలగించిన బీడింగ్

భిక్కనూరు: మండలంలోని జాతీయ రహదారిపై లారీలు నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్లపై దుండగులు మత్తుమందు చల్లి చోరీలకు పాల్పడుతున్నారు. గత మూడురోజులుగా చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. భిక్కనూరు సమీపంలోని సిద్ధరామేశ్వర నగర్ శివారులో జాతీయ రహదారి లే బైలో స్థానికుడికి చెందిన రెండు లారీలను నిలిపి డ్రైవర్లు నిద్రకు ఉపక్రమించారు. దుండగులు లారీల బీడింగ్‌ను తొలగించి డ్రైవర్లపై మత్తు మందు చల్లారు. ఓ డ్రైవర్ వద్ద నుంచి రూ.2,500, మరో డ్రైవర్ వద్ద నుంచి రూ.2వేలతోపాటు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. అలాగే శుక్రవారం రాత్రి మండల కేంద్రానికి చెందిన డీసీఎం వ్యాన్‌ను స్థానిక పెట్రోల్ పంప్‌లో నిలిపి డ్రైవర్ దుబ్బయ్య నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ పంప్ ప్రహరీపై నుంచి దూకి వ్యాన్ అద్దం బీడింగ్‌ను తొలగించాడు. డ్రైవర్‌కు మెలకువ వచ్చి అరవడంతో దుండగుడు పరారయ్యాడు. చోరీ యత్నానికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

తల్లిదండ్రులకు అక్కాచెల్లెళ్ల అప్పగింత



బాలికతోపాటు చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

రెంజల్(బోధన్): తన చిన్నారి చెల్లితో తప్పిపోయి వచ్చిన బాలికను రెంజల్ పోలీసులు తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని మండల కేంద్రానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఇందు, సంగీత శుక్రవారం రాత్రి బోధన్‌లోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కందకుర్తి నైట్‌హాల్ట్ బస్సులో కందకుర్తికి చేరుకున్నారు. స్థానికులు గమనించి ఆరా తీశారు. తప్పిపోయి వచ్చారని నిర్ధారించుకొని పేపర్‌మిల్‌లోని ఓ వృద్ధురాలి వద్ద ఉంచి భద్రత కల్పించారు. శనివారం వర్ని పోలీసులకు సమాచారం అందించగా వారు తల్లిని తీసుకుని రెంజల్‌రాగా, పిల్లలను తల్లికి అప్పగించారు.